క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



పూడిక తీయిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: పట్టణ అభివృద్ధికి ప్రతీఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని డ్రైనేజీలు మట్టితో కూడుకుపోవడంతో శుక్రవారం జేసీబీ సహకారంతో పూడిక తీయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ కాలనీ స్వచ్ఛకాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శానిటేషన్ సిబ్బంది రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రొంపికుంట పాఠశాలలో బోనాలు



బోనాల వేడుకల్లో విద్యార్థులు

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎం వేగోళపు సత్యనారాయణగౌడ్, ఉపాధ్యాయులు నవత, సంపత్, వనిత, శ్రీవాణి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మహాధర్నాలో మాజీ సర్పంచ్‌లు

రామగుండం: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాలో అంతర్గాం మండలంలోని మాజీ సర్పంచులు ధరణి రాజేశ్, మేర్గు పోచం, గుమ్ముల రవీందర్, బండారి ప్రవీణ్, ధర్మాజీ కృష్ణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బిల్లులు విడుదల చేయకపోవడంతో సర్పంచులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం మార్పు అనంతరం మాజీ సర్పంచులకు సంబంధించిన అభివృద్ధి పనుల బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో చాలా మంది సర్పంచులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని వాపోయారు.

మహిళల రక్షణ కోసం నిరంతర నిఘా



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లావణ్య

గోదావరిఖనిటౌన్: స్థానిక శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల కళాశాలలో శుక్రవారం షీటీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి ఎస్‌ఐ లావణ్య మాట్లాడారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం షీటీం నిరంతరం నిఘా ఏర్పాటు చేసిందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 63039 23700 నంబర్‌కు సమస్య తెలపాలని సూచించారు. షీటీం సభ్యులు సురేశ్, స్నేహలత, మౌనిక, కళాశాల ప్రిన్సిపాల్ కల్పన పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 96 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్, నెక్సా వంటి దాదాపు 10 కార్పొరేట్ కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. సుమారు 200 మంది అభ్యర్థులు హాజరు కాగా 96 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాల్లో ఉద్యోగాలు చేయడానికి అర్హత పత్రాలను అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బారావు, మెంటర్ ఉషారాణి పాల్గొన్నారు.

ప్రతీ మలుపు ప్రమాదకరమే..



విలోచవరం వెళ్లే దారిలో మూలమలుపు



బిట్టుపల్లి సమీపంలో ప్రమాదకరంగా మూలమలుపు



పోతారం మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఎస్సారెస్పీ కాలువ

మంథనిరూరల్: మంథని మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గంలో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని బిట్టుపల్లి సమీపంలోని మూలమలుపు, విలోచవరం వెళ్లే రహదారిలో పలు మూలమలుపులు, మంథని నుంచి కాటారం వెళ్లే ప్రధాన రహదారిలోని గాదుదుల గండి వద్ద మూలమలుపు, రచ్చపల్లికి వెళ్లే రహదారిలో మరో మూలమలుపు ప్రమాదకరంగా ఉన్నాయి. అంతేకాకుండా పోతారం వెళ్లే రహదారిలో మూలమలుపు వద్ద ఉన్న ఎస్సారెస్పీ కాలువతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అయితే ప్రతీ మూలమలుపు ప్రమాదకరంగా ఉన్నా ఎక్కడా హెచ్చరిక బోర్డులు మాత్రం కానరావడం లేదు. ఎప్పుడైనా ప్రమాదం జరిగితే మరుసటిరోజు తాత్కాలిక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం సర్వసాధారణమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతీ మూలమలుపు వద్ద శాశ్వతంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సీసీరోడ్డుపై నిలుస్తున్న నీరు



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామం రెండో వార్డులో సీసీ రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షానికి వరద నీరు నిలిచి పాకురు పట్టింది. వరదనీరు రోడ్డుపై నిలిచి ఉండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు వరద నీటిని బయటకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని రెండో వార్డు ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ఇది సామాజిక బాధ్యత అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. కుందనపల్లి ఇంధననిల్వల కేంద్రం సమీపంలో గల అటవీశాఖ ఉద్యానవనంలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, ఎఫ్‌ఆర్‌వో సతీశ్‌కుమార్‌తో పాటు వివిధ విభాగాల ఫారెస్ట్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, లిటిల్ సిటిజన్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల గోడ నిర్మాణ పనులు ప్రారంభం

గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల కొత్త ప్రహరీ నిర్మాణం, పాత ప్రహరీ మరమ్మతుకు యూనివర్సిటీ అంతర్గత నిధులు రూ.86.50లక్షల వ్యయంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ శుక్రవారం పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు విద్యాసంస్థల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి సురేశ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రమాకాంత్, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రినిటి విద్యార్థులకు జాతీయస్థాయి బహుమతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి ఇంజనీరింగ్ (అటానమస్) కాలేజీ విద్యార్థులు బెంగళూరులో జరిగిన ఐఐఎస్సీ, ఐఐటీ బాంబే ఆధ్వర్యంలో జరిగిన కోడ్‌బూట్ హ్యాకథాన్–2025 పోటీల్లో రెండో బహుమతి సాధించారని కాలేజీ అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. తొలిదశలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 64జట్లు పాల్గొన్నాయని పేర్కొన్నారు. కోడ్‌టైటాన్స్ జట్టు సభ్యులు సయ్యద్ మాహిజబీన్, గోదారి వైష్ణవి, రాహుల్ పటేల్ బందారి కలిసి ఆటిజం పిల్లలకు ఉపయోగపడే విజువల్ ఫ్రెండ్లీ మెడికేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం రూపొందించారు. దేశవ్యాప్త పోటీల్లో రెండో స్థానంలో నిలిచి రూ.50వేల నగదు బహుమతి అందుకున్నారు. విద్యార్థులను కాలేజీ వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మణిగణేశన్, సమ్మయ్య అభినందించారు.

లయన్స్‌క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరం నిర్వహిస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని ఆర్యవైశ్య భవన్‌లో శుక్రవారం రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో గోదావరిఖని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 102 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 42 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉందని నిర్ధారించారు. ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించడంతోపాటు కంటి అద్దాలు కూడా అందజేయనున్నట్లు క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ రీజన్ చైర్మన్ కజాంపురం రాజేందర్, జోన్ చైర్మన్ నార్ల ప్రసాద్, గోదావరిఖని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి ఎస్.సత్యప్రసాద్, గోదావరిఖని లయన్స్ క్లబ్ స్ఫూర్తి అధ్యక్షులు మామిడిపల్లి శ్రీధర్, ప్రతినిధులు కోదాటి ప్రవీణ్, సందినేని గోపాల్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతి

కోల్‌సిటీ: కాళేశ్వరం జోన్–1 పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లలో పని చేస్తున్న ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతి లభించింది. రామగుండం నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా డిప్యూటేషన్‌లో పనిచేస్తున్న కుమారస్వామికి శానిటరీ సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించి మంచిర్యాల కార్పొరేషన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే వరంగల్ నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా డిప్యూటేషన్‌లో పనిచేస్తున్న శ్యాంసుందర్‌కు కూడా శానిటరీ సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించి, నగరపాలక సంస్థకు పోస్టింగ్ ఇచ్చారు.

• రామగుండం ఎంఈవోకు సన్మానం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఎఫ్‌ఆర్‌ఎస్ మానిటరింగ్‌లో భాగంగా రామగుండం ఎంఈవో జింక మల్లేశం శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు ఆయనను జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జయరాజు, ఉపాధ్యాయులు సన్మానించారు.

• పద్మశాలీ నాయకులకు సన్మానం

ఎలిగేడు: పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడిగా ఉన్న మామిడాల రమేశ్‌తో పాటు గ్రామశాఖ అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ(వంటలు)ను హైకోర్టు న్యాయవాది మాజీ వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్ శుక్రవారం సన్మానించారు. నాయకులు ముత్కల మల్లేశం, కిక్కర్ల చందు, గుర్రం అనిల్, ప్రదీప్ ఉన్నారు.

• గ్రామసభ

జూలపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీవో అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. వనమహోత్సవం, పారిశుధ్యం, స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీవో మాట్లాడుతూ యాప్‌పై ప్రజలకు వివరించి నమోదు చేయించాలని సూచించారు. కార్యదర్శి ముజీబుద్దీన్ అహ్మద్, వెలుగు సమాఖ్య సీసీ మద్దెల జ్యోతి, అంగన్వాడీ టీచర్లు శైలజ, అలేఖ్య, ఉమారాణి, ఆశాలు పాల్గొన్నారు.

• ఓదెల పీఆర్ ఏఈఈ ఇన్‌చార్జిగా సచిన్

ఓదెల: మండలంలోని పంచాయతీరాజ్ ఏఈఈగా సుల్తానాబాద్‌కు చెందిన సచిన్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన ఏఈఈ ఏసీబీకి చిక్కారు.

• విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం హాస్టల్ వార్డెన్ సంపత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నోట్‌బుక్స్, బ్యాగ్స్, షూస్ పంపిణీ చేశారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

• నానో యూరియా వినియోగంతో మేలు

పాలకుర్తి: రైతులు తక్కువ ఖర్చుతో నానో యూరియా వినియోగించి అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ సూచించారు. ప్రస్తుతం రైతులు బస్తాల రూపంలో యూరియా వాడుతున్నారని, అయితే ద్రవరూపంలో ఉండే నానో యూరియా అందుబాటులోకి వచ్చిందన్నారు. దీన్ని వినియోగించడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. దీంతో పాటు భూమికూడా తన సారవంతం కోల్పోకుండా ఉంటుందని, రైతులు ఈ దిశగా తమ సాగు పద్ధతిని మార్చుకోవాలని కోరారు. వరి మినహా ఇతర పంటలకు, మొక్కలకు యూరియా అందించేందుకు మహిళా కూలీలు అవసరమవుతారని, నానో యూరియాను పవర్‌స్ప్రేయర్, చేతి పంపు, డ్రోన్‌ల ద్వారా స్ప్రే చేసుకోవచ్చని, పైగా దీనికి ఖర్చు కూడా తక్కువే అవుతుందని వివరించారు.

మొక్కలు పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో లలిత

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి, కమాన్‌పూర్ గ్రామాల్లో ఇందిర మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శుక్రవారం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో మారుతి, పంచాయతీ కార్యదర్శులు శంకర్, ఏపీఎం శైలజశాంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలపై చర్చ



అధికారితో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలపై సీఎంపీఎఫ్ రామగుండం రీజియన్ కమిషనర్ హరిపచౌరిని శుక్రవారం బీఎంఎస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో నాయకులు పులి రాజారెడ్డి, మండ రమాకాంత్, వీరమనేని రవీందర్‌రావు, సారంగపాణి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వోల్వో డంప్ ట్రక్ శిక్షణ

గోదావరిఖని: హెవీ గూడ్స్ వెహికల్ (హెచ్‌జీవీ) డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న నిరుద్యోగులకు సింగరేణి యాజమాన్యం ద్వారా వోల్వో డంప్ ట్రక్ శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆర్జీ–1 పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. దీనికి హెవీ గూడ్స్ వెహికల్ (హెచ్‌జీవీ) డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్‌లో మూడేళ్ల అనుభవం, ఎస్‌ఎస్‌ఈ విద్యార్హత కలిగిన యువకులు అర్హులన్నారు. సింగరేణివ్యాప్తంగా 60మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 20లోగా ఆర్జీ–1 ఏరియా జీవీటీసీలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రజక సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు



పూజల్లో పాల్గొన్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: మండల కేంద్రంలో రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక మొక్కులు చెల్లించి, మడేలేశ్వర స్వామికి బోనం సమర్పించారు. రజక సంఘం నాయకుల ఆహ్వానం మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొని మడేలేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రజక సంక్షేమ సంఘం సభ్యులతో పాటు నాయకులు మేర శ్రీనివాస్, పొలగాని సతీశ్, గంగిపెల్లి భూమయ్య, నగునూరి నారాయణ, శంకరయ్య, ఓదెలు, స్వామి, సాగర్, అనిల్, అశోక్, రాకేశ్, నర్సింగం, మల్లయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

నెల్సన్ మండేలా జయంతి



గోదావరిఖనిటౌన్: ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో అంతర్జాతీయ నెల్సన్ మండేలా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ట్రస్ట్ నిర్వాహకులు దాసరి స్వప్న–మహేశ్, పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర జ్యోతి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో శుక్రవారం ఓ వ్యాన్‌లో ఎక్కువ మంది కార్మికులను తీసుకెళ్తుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. సంబంధిత రవాణాశాఖ, ట్రాఫిక్ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని వాహనంతో ఎక్కువ మంది ప్రజలను తీసుకెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సింగరేణి వార్తలు

విధులకు గైర్హాజరైతే ఉద్యోగానికే ముప్పు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: విధులకు గైర్హాజరైతే ఉద్యోగానికే ముప్పు వస్తుందని ఆర్జీవన్ జీఎం లలిత్‌కుమార్ అన్నారు. గడిచిన మూడేళ్లలో నిర్దేశిత మస్టర్లు నిండని కార్మికులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలోని జీడీకే–1, 2, 2ఏ, 11వ గని, జీడీకే–5 ఓసీపీలో పనిచేస్తూ గైర్హాజరైన 378మంది ఉద్యోగులకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ కౌన్సెలింగ్‌కు 109 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం దొరకడం చాలా కష్టమని, వచ్చిన ఉద్యోగాన్ని కాపాడుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే సింగరేణి ఆసుపత్రిలో తగిన వైద్యం చేయించుకోవాలన్నారు. విధులకు హాజరై నిర్దేశిత మస్టర్లను పూర్తి చేయాలన్నారు. గడిచిన మూడేళ్ల మస్టర్లను పరిగణలోకి తీసుకొని విధుల నుండి తొలగించబడతారని స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలుంటే యాజమాన్యం పరిష్కరించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు అనిత, ఎస్‌వోటూ జీఎం ఆంజనేయప్రసాద్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్దె ఎల్లయ్య, సీఎంఓఏఐ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆషాఢం.. గోరింటాకు ఉత్సవం



గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లిలో శుక్రవారం ఆషాఢమాసం.. గోరింటాకు ఉత్సవాన్ని మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మాజీ సర్పంచ్ పూదరి మహేందర్–అనూష ఆధ్వర్యంలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మహిళలంతా ఒక్కచోట చేరి గోరింటాకు చేతులకు అలంకరించుకున్నారు. ఫ్రెండ్లీ గాజులు వేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గాదె మాధవి, పూదరి అనూషతో పాటు నాయకులు అమిరిశెట్టి తిరుపతి, కుమ్మరి రవి, అగుల్ల శ్రీశైలం పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని పారిశుధ్య సిబ్బందికి శుక్రవారం స్థానిక అడ్డగుంటపల్లి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు అన్ని డివిజన్లలో డ్రై డే ఫ్రై డే, రామమందిర్ రోడ్డులో ప్రజామరుగు దొడ్డి శుభ్రం చేయించడం తదితర స్పెషల్ డ్రైవ్ పనులు నిర్వహించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పనులను పర్యవేక్షించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, నాగభూషణం, కుమారస్వామి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా టీఎంసీ మౌనిక, సీవోలు శ్వేత, ఊర్మిళ, ప్రియదర్శిని పాల్గొన్నారు.

భూసర్వేలో టెక్నాలజీ వినియోగంతో స్పష్టత



ఫీల్డ్ శిక్షణ ఇస్తున్న సర్వేయర్ సురేశ్ కృష్ణ

జ్యోతినగర్: భూసర్వేలో టెక్నాలజీ వినియోగంతో స్పష్టత వస్తుందని రామగుండం మండల సర్వేయర్ సురేశ్ కృష్ణ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఐదో డివిజన్ మల్యాపూర్ వ్యవసాయ భూముల్లో కొత్తగా నియమితులైన సర్వేయర్లకు శుక్రవారం ఫీల్డ్ శిక్షణపై అవగాహన కల్పించారు. సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, తదితర వాటికి తప్పనిసరిగా సర్వే చేసి మ్యాప్ జత చేయాల్సి ఉంటుందని సూచించారు. టెక్నాలజీ ద్వారా భూకొలతలు అత్యంత ఖచ్చితంగా తక్కువ సమయంలో గుర్తించవచ్చన్నారు. సర్వేలో ఉపయోగపడే పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షణ సర్వేయర్లు పాల్గొన్నారు.